# మెట్రో రెండో దశకు ఓకే!



## మెట్రో రెండో దశకు పచ్చజెండా!

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో మరో ముందడుగు.. మొదటి దశ పనులు ముమ్మరంగా సాగుతుండగా, కేంద్రం రెండో దశ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలోని 3 కారిడార్ల నిడివి 72.16 కి.మీ. కాగా, రెండో దశ ఏడు రూట్లలో 85 కి.మీ. మేర చేపట్టనున్నట్లు తెలిసింది.

- మెయిన్‌లో ▸

## కేంద్రం గ్రీన్‌సిగ్నల్! • వచ్చే ఏడాది ప్రారంభం • ఏడు రూట్లలో 85 కిలోమీటర్ల మెట్రో కారిడార్

హైదరాబాద్, న్యూస్‌లైన్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెట్రో రైలు ప్రాజెక్టులో మరో ముందడుగుపడింది. ప్రస్తుతం మూడు కారిడార్లలో 72.16 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్న తరుణంలోనే రెండో దశ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజా మెట్రో మార్గాన్ని ఏడు రూట్లలో 85 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం అమెరికాకు చెందిన లీ అసోసియేట్స్ సంస్థ రెండోదశ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే చేపట్టింది. ఆరు నెలల్లోగా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు సిద్ధంకానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతో వచ్చే ఏడాది పనులు చేపట్టనున్నట్లు సమాచారం. కాగా మొదటి దశలో నాగోల్-శిల్పారామం(28.51 కి.మీ.), జేబీఎస్-ఫలక్‌నుమా (14.78 కి.మీ.), మియాపూర్-ఎల్బీనగర్(28.87 కి.మీ.) రూట్లలో నిర్మాణ సంస్థ 'ఎల్‌అండ్‌టీ' పనులు మొదలుపెట్టింది. పనులు వేగవంతం చేసేందుకు ఈ మూడు కారిడార్లలో చేపట్టిన పనులను ఆరు దశలుగా విభజించారు. ప్రస్తుతం నాగోల్-మెట్టుగూడా రూట్లో 8 కిలోమీటర్ల మేర(మొదటిదశ), మియాపూర్-ఎస్.ఆర్.నగర్(రెండో దశ) రూట్లో పనులు ఊపందుకున్నాయి. పిల్లర్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రాజెక్టు పనులకు అవసరమైన 269 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఇప్పటివరకు 89 పిల్లర్లను ఏర్పాటు చేశారు. నవంబర్‌లో మెట్రో ట్రాక్ నిర్మాణం పనులు ప్రారంభంకానున్నాయి.



**నేపథ్యమిదీ..**

ప్రస్తుతం గ్రేటర్ నగరంలో వాహనాల సంఖ్య దాదాపు 25 లక్షలకు చేరుకుంది. బయటిప్రాంతాల నుంచి నిత్యం మరో ఐదు లక్షల వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తుండడంతో రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. సగటు వాహన వేగం గంటకు 11 కిలోమీటర్లు మించడం లేదు. ఈ నేపథ్యంలో మెట్రో ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన విషయం విదితమే. ప్రజల నుంచి అందుతున్న విజ్ఞప్తులు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు మెట్రో రెండోదశపై దృష్టి సారించినట్లు హైదరాబాద్ మెట్రో రైలు(హెచ్‌ఎంఆర్) ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి 'న్యూస్‌లైన్'కు తెలిపారు. మొదటి దశను మరో ఐదేళ్లలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. రెండు మెట్రో ప్రాజెక్టులు పూర్తయితే నగరం రూపురేఖలు సమూలంగా మారనున్నాయన్నారు.

### రెండో దశ రూట్లు ఇవే..

| రూటు | దూరం (కిలోమీటర్లలో) |
|---|---|
| మియాపూర్-బీహెచ్‌ఈఎల్-పటాన్‌చెరువు | 15 |
| ఫలక్‌నుమా-శంషాబాద్(వయా రేడియల్ రోడ్ నం.29) | 12 |
| ఎల్బీనగర్-వనస్థలిపురం | 4 |
| నాగోల్-ఎల్బీనగర్-ఫలక్‌నుమా | 15 |
| జేఎన్‌టీయూ-శిల్పారామం-గచ్చిబౌలి | 14 |
| జేబీఎస్-అల్వాల్ | 8 |
| గచ్చిబౌలి-టోలిచౌకి-లక్డీకాపూల్ | 17 |
| మొత్తం | 85 |